గ్రంథాలయం కలేనా..?

- మూడేళ్ల క్రితం పాత భవనం కూల్చివేత
- ఇంకా నిర్మించని కొత్త భవనం
- ఇబ్బందులు పడుతున్న పోటీ పరీక్షల అభ్యర్థులు



పల్లెప్రగతిలో భాగంగా కూల్చివేసిన పాత గ్రంథాలయ భవనం (ఫైల్)

సిర్పూర్(టి): మండల కేంద్రంలో గ్రంథాలయం లేక విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసిన అధికారులు కొత్త భవనం మంజూరు చేయకపోవడంతో నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో గల ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న శాఖ గ్రంథాలయ భవనాన్ని పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా అధికారులు కూల్చివేశారు. భవనాన్ని కూల్చి మూడేళ్లు గడుస్తున్నా నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి మాత్రం మోక్షం కలగడం లేదు.

నేలమట్టం..

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో 1990లో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టగా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఏటా గ్రంథాలయ భవనంలో వర్షపు నీరు ఉరుస్తుండడంతో పాఠ్యపుస్తకాలు, పోటీపరీక్షల పుస్తకాలు, గ్రంథాలయ సామగ్రి పూర్తిగా నీటితో తడిచిపోయేవి. భవనం పైపెచ్చులు పడిపోతుండడంతో స్థానికులు గ్రంథాలయానికి వచ్చేందుకు భయాందోళన చెందేవారు. గ్రంథాలయంలో సుమారు 15వేల పాఠ్య పుస్తకాలు, 25 కుర్చీలు, టేబుల్లు తదితర సామగ్రి ఉండగా వర్షపు నీటికి తడిచి కొంత మేర చెడిపోయాయి. ఇతర సామగ్రిని సమీపంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల భవనంలోని ఓ గదిలో భద్రపరిచారు.

అభ్యర్థుల ఇబ్బందులు..

మండలంలో గ్రంథాలయం లేకపోవడంతో పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు దూర ప్రాంతాలకు వెళ్లి పాఠ్య పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం నిర్మించాలని, లేదంటే తాత్కాలికంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వం భవనంలోని ఓ గది కేటాయించి గ్రంథాలయాన్ని కొనసాగించాలని యువకులు మొరపెట్టుకుంటున్నారు. ఇటీవల తహసీల్దార్ శ్రీనివాస్‌కు స్థానిక యువకులు గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రానికి వచ్చిన జిల్లా అదనపు కలెక్టరు దీపక్ తివారికి గ్రంథాలయ సమస్యను వివరించారు. ఆయన వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోని ఓ గదిని గ్రంథాలయానికి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు గ్రంథాలయ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. కాగా గ్రంథాలయ భవన నిర్మాణానికి గతంలోనే నిధులు మంజూరయ్యాయని, భవన నిర్మాణానికి పంచాయతీ స్థలం కేటాయించకపోవడంతో పనులు చేపట్టడంలేదని అధికారులు పేర్కొంటున్నారు.

అధికారులు స్పందించాలి



గ్రంథాలయం లేకపోవడంతో పోటీపరీక్షల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రంథాలయం లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక, ఇక్కడ పోటీపరీక్షల మెటీరియల్స్ లేక పోటీపరీక్షలకు సన్నద్ధం కాలేకపోతున్నాం. అధికారులు స్పందించాలి.

– ఇమ్రాన్‌ఖాన్, సిర్పూర్ (టి)

తాత్కాలిక భవనంలో కొనసాగించాలి



గ్రంథాలయ నూతన భవనం నిర్మించే వరకు తాత్కాలికంగా ప్రభుత్వ భవనంలోని ఓ గది కేటాయించి గ్రంథాలయం కొనసాగించాలి. తాత్కాలిక భవనంలో పరీక్షల స్టడీ మెటీరియల్స్, పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి.

– అబ్దుల్ సల్మాన్, సిర్పూర్ (టి)

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు
- ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: అధికారులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి పాటు పడాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ పనితీరుపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, అధికారులు తమ పనితీరు మార్చుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండి పని చేయాలని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని పేర్కొన్నారు. కౌటాలలో మిర్చి సాగు అధికంగా ఉందని, స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పోడు భూముల విషయంలో అటవీశాఖ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని తెలిపారు. అధికారులకు ఈ ప్రాంతంలో పని చేయడం ఇష్టం లేకపోతే వేరే ప్రాంతాలకు వెళ్లిపోవచ్చన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు పంపాలని ఎంపీడీవోను ఆదేశించారు.

పలు శాఖలపై చర్చ

సమావేశంలో సీహెచ్‌వో మహాలక్ష్మి తమ శాఖ నివేదికలు చదివి వినిపించారు. కౌటాల పీహెచ్‌సీలో వైద్యాధికారి లేరని, వెంటనే వైద్యాధికారిని నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో కుష్ఠు వ్యాధి, టీబీ వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీటీసీ మోతీరాం పేర్కొన్నారు. అనంతరం మిషన్ భగీరథ ఏఈలు ఐనోశ్, పృథ్వి తమ శాఖ నివేదికలు చదివి వినిపించగా.. పాత కన్నెపల్లి గ్రామానికి మిషన్‌భగీరథ నీరు రావడం లేదని ఎంపీటీసీ మోతిరాం ప్రశ్నించారు. కౌటాలలో సక్రమంగా నీటిని సరఫరా చేయడం లేదని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ నివేదికలను సబ్‌ఇంజనీర్ ప్రశాంత్ వివరించగా.. మండలంలో తరుచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని, విద్యుత్ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడం లేదని ఎంపీటీసీలు వసంత్‌రావు, మోతీరాం ప్రశ్నించారు. విద్యుత్ అధికారులు ఓఆర్‌సీ పేరిట రైతుల వద్ద నుంచి రూ. లక్షలు వసూలు చేస్తున్నారని, ట్రాన్స్‌ఫార్మర్‌కు రైతులు గద్దెలు కట్టించుకుంటే గుత్తేదారులు బిల్లులు లేపుతున్నారని ఆరోపించారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏవో రాజేశ్, ఏపీవో పూర్ణిమ, ఏఈ మక్బుల్ హుస్సేన్, ఏపీఎం ముక్తేశ్వర్, సూపర్‌వైజర్ షకీరా బేగం, ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

కౌటాల: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శనివారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం నిర్మించడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ పుష్పలత, రెవెన్యూ సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సిబ్బందికి సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

వీర్దండి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల జై భీర్య హనుమాన్ మందిర్ ప్రశాంత్ ధాం ఆలయంలో మార్చి 8 నుంచి జరిగే మహా జాతర పోస్టర్లను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు వానుపటేల్, నాయకులు మల్లయ్య, విజయ్, మధుకర్, చందు, మితున్, భీమయ్య, కమలకార్, రవి, తిరుపతి, సత్తయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

అధ్వానంగా రైతువేదికలు



గూడెం రైతు వేదిక ముందు కూలీలు వంట కోసం ఏర్పాటు చేసిన కట్టెల పొయ్యిలు



రుద్రాపూర్‌లోని రైతువేదిక మరుగుదొడ్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా క్లస్టర్లలో ఏర్పాటు చేసిన రైతువేదికలు రైతులకు ఉపయోగపడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రైతు వేదికల్లో విధులు నిర్వహించాల్సిన ఏఈవోలు అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో రైతు వేదికలను కేవలం వ్యవసాయ, రైతు సంబంధిత కార్యక్రమాలకే వినియోగించాలని నిబంధనలు విధించినా అనంతరం నిబంధనలు మార్చారు. ప్రభుత్వపరమైన కార్యక్రమాలను నిర్వహించడానికి అనుమతులు జారీ అయ్యాయి. కాగా రైతు వేదికల్లో అందుబాటులో ఉండకుండా సంబంధిత అధికారులు వారికి నచ్చిన చోట ఉంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతువేదికల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు గూడెం రైతు వేదికను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు వినియోగించుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైతువేదిక ముందు కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రైతు వేదికలో వంట సామాన్లు భద్రపర్చుకున్నారు. బట్టలు ఆరేసుకున్నారు. అయినా అధికారులు పట్టనట్లుగా వ్యవహరించారని రైతులు విమర్శిస్తున్నారు.

పట్టింపు లేని అధికారులు..

మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదిక మండల కేంద్రానికి సమీపంలో ఉండడంతో ఇక్కడ తరచూ ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో, రెవెన్యూ, ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలను నిర్వహించడానికి అనువుగా ఈ రైతువేదిక ఉంది. మిగతా వాటిలో కోర్సిని, గూడెం మినహా రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. గ్రామాలకు దూరంగా ఉన్న రైతువేదికల నిర్వహణ సరిగా లేక పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. పలు రైతు వేదికల్లో తలుపులు, కిటికీలు, ఇతర వస్తువులను దొంగిలించారు. గాలులకు పలుమార్లు రైతువేదికల పై కప్పులు ధ్వంసమయ్యాయి. రైతువేదికల్లో గచ్చు పగిలి శిథిలమవుతోంది. లోపలకు వెళ్లేందుకు నిర్మించిన మెట్లు సైతం పగిలిపోయి ఉన్నాయి. నిర్వహణ లేకపోవడంతో రైతువేదికల వద్ద నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. మరుగుదొడ్ల వద్ద పిచ్చి మొక్కలు పెరిగి వినియోగించలేని పరిస్థితులు నెలకొన్నాయి. వీటికి కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. మరుగుదొడ్ల గోడలు పగుళ్లు తేలాయి. వ్యవసాయ అధికారులు పట్టించుకోక పోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు వేదికలకు మరమ్మతులు చేపట్టాలని, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులకు నిధులు లేవు..

రైతువేదికల్లో మరమ్మతులు చేయించడానికి నిధులు అందుబాటులో లేవు. మరుగుదొడ్లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ నిధుల లేమి కారణంగా చేపట్టడం లేదు. ఏఈవోలు స్థానికంగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి

వనదేవతలకు మొక్కులు

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్, లోడుపల్లి గ్రామాల్లో వన దేవతల జాతరకు శనివారం భక్తులు పోటెత్తారు. సమ్మక్క, సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఒడి బియ్యం, పసుపు, కుంకుమలతో అమ్మవారికి సారె అందించారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు కుంచవెల్లి, రాంపూర్, పంబాపూర్ గ్రామాల్లో సమ్మక్క, సారలమ్మ జాతర శనివారం నిర్వహించారు. వన దేవతల గద్దెల వద్ద భక్తులు మొక్కులు చెల్లించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు చేరుకున్నారు. జాతరలో ఆట బొమ్మలు, గాజుల దుకాణాలు వెలిశాయి. జాతర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ వాగు ఒడ్డున గల సమ్మక్క సారలమ్మ గద్దె వద్ద నాలుగో రోజు సైతం భక్తుల సందడి నెలకొంది. బాలాజీ వేంకటేశ్వర స్వామి జాతరకు తరలివచ్చిన భక్తులు పక్కనే ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకొని అమ్మవార్లకు పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి, బెల్లాన్ని సమర్పించారు. కోరిన కోరికలు తీర్చాలని అమ్మవారికి ముడుపులు కట్టారు.



దహెగాం: జాతరలో భక్తుల సందడి

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర శనివారం ముగిసింది. పట్టణ ప్రజలతో పాటు సిర్పూర్(టి), కౌటాల, ఆసిఫాబాద్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



రెబ్బెన: దర్శించుకుంటున్న భక్తులు



దహెగాం: పూజలు చేస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



కాగజ్‌నగర్‌రూరల్: దర్శించుకుంటున్న భక్తులు

బావి పనులు ప్రారంభం



బావి పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి: మండలంలోని పాటగూడ గ్రామంలో శనివారం బావి పనులను ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో క్రిష్టారావు ప్రారంభించారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని గ్రామస్తులు గతంలో అధికారులకు విన్నవించిన నేపథ్యంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా బావి పనులు ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం బాబేఝరి గ్రామ పంచాయతీలో ఉన్న నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ల, శ్మశాన వాటికలు పరిశీలించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏ నాగోరావు తదితరులు ఉన్నారు.

అంగరంగ వైభవంగా కల్యాణం



శ్రీనివాసుని కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ్ దేవాలయం ఆలయంలో శనివారం శ్రీనివాసుని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బాచంపల్లి కమలాకర్, కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవా, ప్రత్యేక అభిషేకం, దర్శనం, అన్నప్రసాద వితరణ, కల్యాణ మహోత్సవం, రాత్రి స్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలి



కళాజాత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

సిర్పూర్(టి): అర్హులైన ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు కలిగి ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాత బృందం సభ్యులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నూతన ఓటరు నమోదు, ఓటు ఆవశ్యకత, ఓటుహక్కు వినియోగంపై కళాజాత బృందం సభ్యులు ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతన ఓటరు నమోదు కార్యక్రమంతో పాటు మార్పులు, చేర్పులు నిర్వహిస్తుందని, అర్హులైన వారు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ హెచ్‌ఆర్ మేనేజర్ మల్లేష్, ఎంపీడీవో పి.సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం దుర్గయ్య, ఇన్‌చార్జి ఎంపీవో కృష్ణమూర్తి, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన కేంద్రం వార్షికోత్సవం

వాంకిడి: మండల కేంద్రంలోని శ్రీ సంత్ పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 8వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సిద్ధేశ్వర ట్రస్ట్ పట్నాపూర్ ముఖ్య సంస్థాన్ ప్రధాన కార్యదర్శి దాదారావు మగాడె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధ్యానం సమస్త ఫలాల ప్రదాత అని ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని ధ్యాన సాధన చేయాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాబా చూపిన మార్గంలో నడవాలని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బొట్టుపల్లి జైరాం, భగవంత్ రావు, ప్రకాశ్ మగాడె, తిరుపతి, వడై బాబురావు, బెండారె కృష్ణ, సదాశివ్, చందు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

లింగాపూర్: మండలంలోని 16 పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పోలింగ్ కేంద్రాలలో సకల సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఐ ప్రకాశ్, ఆర్ఐ ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

26న అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఉత్తర వాహిని నదీ తీరాన కొలువుదీరిన శ్రీ అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ 13వ వార్షికోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు హారతి, 8 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజా, హోమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ తెలిపారు. హోమం, పూర్ణాహుతి అనంతరం స్వామి వారి మహాప్రసాదం, 10.30 గంటలకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ నానయ్య

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ గ్రామంలో సీసీరోడ్డు పనులను ఎంపీపీ డుబ్బుల నానయ్య శనివారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డుబ్బుల వెంకన్న, కాంగ్రెస్ నాయకులు జునుగరి శేఖర్, లోడెల్లి ప్రవీణ్ కుమార్, చాప్లె శ్రీనివాస్, పాలాజీ రాజన్న, నాగయ్య పాల్గొన్నారు.

27న గాయత్రీ మహాయజ్ఞం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని న్యూకాలనీలో గల గాయత్రీ శక్తి పీఠం వద్ద ఈ నెల 27న 24 కుండీల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాయత్రీ పరివార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాయత్రీ తీర్థ శాంతికుంజ్ హరిద్వార్ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న గణేశ్‌మందిర్ నుంచి గాయత్రీ శక్తిపీఠం వరకు కలశ యాత్ర, ధ్వజారోహణం, 27న ఉదయం 8.30 గంటల నుంచి గాయత్రీ పూజ, 24 కుండీల యజ్ఞం, ప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటలకు దీప యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న జీవస్వరం

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో రెండో రోజు శనివారం జీవస్వరం సువార్త స్వస్థత కూటములు కొనసాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంతోని మాట్లాడుతూ క్రైస్తవులకు దేవుని వాక్యం బోధించారు. ఫాదర్లు టోమ్, సీజో, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

బెజ్జూర్: మంచిర్యాల జిల్లా కోటపెల్లి మండలం బోరంపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని శనివారం మాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై విక్రమ్ అక్కడికి చేరుకొని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. మండల మాలి సంఘం అధ్యక్షుడు ఆడె అశోక్, ఉపాధ్యక్షుడు బాపురావ్, సంఘం నాయకులు కావుడె గోపాల్, శంకర్, మోహన్, సురేష్, నీలయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కమిటీ ఏర్పాటుపై హర్షం

కెరమెరి: 317 జీవో బాధిత ఉద్యోగుల వివరాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేయడంపై 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సంఘం మండలాధ్యక్షుడు క్రాంతి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం లోకల్ జిల్లాలతో సంబంధం లేకుండా పోస్టింగ్‌లు ఇవ్వడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వినోద్, శ్రీకాంత్, బాలక్రిష్ణ, నరేశ్, శివప్రసాద్, శుభాంగి, వినీత్, సురేశ్ తదితరులు ఉన్నారు.

పల్లకి ఊరేగింపు



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో శనివారం కొండయ్య మహరాజ్ పల్లకిని భక్తులు ఊరేగించారు. మహరాజ్ భక్తులు భక్తిశ్రద్ధలతో భాజాభజంత్రీలతో గ్రామంలోని కాలనీల్లో పల్లకి ఊరేగించారు. ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మణిరాం, గోవింద్‌రావు, రవి, రాధాకిషన్, అనిల్, బాలాజీ, శంకర్, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.